# మెదక్‌కు భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

## మార్మోగిన నినాదాలు

**సిద్దిపేట అర్బన్, జూలై 17, ప్రభాతవార్త :**
మెదక్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య సమావేశానికి సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ నేతృత్వంలో భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లారు. సమావేశానికి టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనరిసింహ, వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు సమావేశానికి హాజరు కావడంతో సిద్దిపేట నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సిఎం రేవంత్‌రెడ్డి, పార్టీ నేతలకు అనుకూలంగా నినాదాలు హోరెత్తించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాకి అనంద్, ఎల్లం యాదవ్, మహేందర్, కలీం, యాదగిరి, పూజల గోపికృష్ణ, లక్ష్మీ, మీసం మహేందర్ యాదవ్, ఎర్ర మహేందర్ తదితరులు ఉన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన బక్కి వెంకటయ్య

**కొల్చారం, జూలై 17(ప్రభాతవార్త):**
కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మరెల్లి అనిల్ ను హత్య చేసిన దుండగుల పై హత్య నేరం తో పాటు ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టి కమిషన్ చెర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం నాడు కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామాన్ని చెర్మెన్ బక్కి వెంకటయ్య సందర్శించారు. గత నాలుగు రోజుల క్రితం దారుణ హత్యకు గురైన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి, దళిత సంఘాల నేత మరెల్లి అనిల్ కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు ఏసమ్మ, అనంతయ్యల తోపాటు కుటుంబ సభ్యులను భక్కి వెంకటయ్య పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని వారిని ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ రాజశేఖర్‌రెడ్డి, కొల్చారం ఎస్ఐ గౌస్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ తదితరులు

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘన స్వాగతం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
కోహెడలో ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్టీల్ బ్యాంక్‌ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవవర్మకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, సీపీ డాక్టర్ అనురాధలు పుష్పగుచ్ఛలు అందజేసి ఘనస్వాగతం పలికారు. కోహెడ వెళుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొద్దిసేపు విడిది కోసం కలెక్టర్ కార్యాలయంలో ఆగారు. దీంతో వారు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.

**స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 సర్వేలో జాతీయ స్థాయిలో**

## హుస్నాబాద్ మున్సిపాలిటీకి 139వ ర్యాంక్

**రాష్ట్రంలో 9వ, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు**

**హుస్నాబాద్ రూరల్, జూలై 17, ప్రభాతవార్త :**
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 సర్వేలో జాతీయ స్థాయిలో 4900పైగా మున్సిపాలిటీలు పాల్గొనగా..జాతీయ స్థాయిలో హుస్నాబాద్ మున్సిపాలిటీకి 139వ ర్యాంక్ దక్కింది. రాష్ట్ర స్థాయిలో మొత్తం 150 మున్సిపాలిటీలతో పోటీపడి 9వ ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. అలాగే ఎడిఎఫ్++ సర్టిఫికెట్ పొందింది. జాతీయస్థాయిలో ర్యాంకు రావడానికి సహకరించిన గత పాలక వర్గానికి, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలకు, మున్సిపల్ అధికారులకు, పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గైరాన్‌తండాను సందర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్



మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జూటోతు హుస్సేన్

**సిర్గాపూర్, జూలై 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గైరాన్ తండాను గురువారం జాతీయ ఎస్టీ కమిసన్ సభ్యులు జూటోతు హుస్సేన్ నాయక్ సందర్శించారు. గైరాన్‌తండా వాసులు రాహల్‌జాదవ్ తండాలో నెలకొన్న సమస్యలను ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకుపోవడంతో గురువారం ఢిల్లీ నుంచి తండాకు చేరుకుని తండాలో పరిస్థితులును సమీక్షించారు. తండాకు చేరుకున్న కమిషన్ సభ్యుడిని తండా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. తండాలో కనీస సౌకర్యాలు లేక నిత్యం పడరాని పాట్లు పడుతున్నామని కమిషన్ సభ్యుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో తండాకు రాకపోకలు సుమారుగా ఆగిపోతాయని, అత్యసవర పరిస్థితుల్లో పడుతున్న పట్లు చెప్పనలవిగా ఉన్నాయని పేర్కొన్నారు. వాగుపై వంతెన నిర్మిస్తామని ఎన్నికల సందర్బంగా నాయకులు హామిలు ఇస్తారే తప్పితే వంతెనను నిర్మించిన పాపాన పోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తండాలో కనీస మౌలిక సదుపాయాలను పాలకులు కల్పించకుంటే కమిషన్ దృష్టికి రాతపూర్వకంగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎఎస్పి సంజీవరావు, ఆర్‌డిఓ అశోక చక్రవర్తి, తహసీల్దార్ హేమంత్, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు రవీందర్‌నాయక్, రమేష్ చౌహాన్, ప్రకాష్ రాథోడ్, జైపాల్, దిగంబర్ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**జూటోతు హుస్సేన్‌ను సన్మానించిన బిజెపి నేత...**

మండల పరిధిలోని గైరాన్‌తండాకు చేరుకున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జూటోతు హుస్సేన్ నాయక్‌ను మండల బిజెపి అధ్యక్షులు శంకర్‌రావు పాటిల్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గోపాల్‌రెడ్డి, మాణిక్ రాజాగౌడ్, హనుమంత్ దశరథ్, నర్సింగ్‌రావు, సునీల్ పాటిల్, జ్ఞానేశ్వర్‌రావు పాటిల్ పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

**-ఐసిడిఎస్ బాధ్యులకు న్యాయమూర్తి సూచన**

**జహీరాబాద్, జూలై 17,ప్రభాతవార్త:** చిన్నారుల ఆరోగ్యంపై ఐసిడిఎస్ బాధ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. శుక్రవారం జహీరాబాద్ ప్రాజెక్టులో జిల్లాలోని 4 ప్రాజెక్టుల నుంచి హాజరైన ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లతో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశానికి సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించుటకు ప్రతి గ్రామం తిరిగి వారి బరువులు తీసుకోవాలని అంగన్‌వాడి టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో డిసిపిఓ రత్నం హబ్లు, కో-ఆర్డినేటర్ పల్లవి, సకి కో-ఆర్డినేటర్ కల్పన, పోషణ అభియాన్ కో-ఆర్డినేటర్ సౌమ్య, జహీరాబాద్, సదాశివపేట, జోగిపేట, నారాయణఖేడ్ సిడిపిఓలు అంజమ్మ, చంద్రకళ, ప్రియాంక, సుజాత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న న్యాయమూర్తి సౌజన్య

# ఆయిల్‌ఫాం సాగుకు రైతులు మొగ్గు చూపాలి

**వ్యవసాయ,మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు**

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి/కోహెడ, జూలై 17, ప్రభాతవార్త :**
ఆయిల్‌ఫాం వైపు రైతులు మొగ్గు చూపాలని.. ఖమ్మం తర్వాత అత్యధిక ఆయిల్‌ఫాం సాగు సిద్దిపేట జిల్లాలోనే సాగవుతుందని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్‌లో గురువారం మెగా ఆయిల్‌ఫాం ప్లాంటేషన్ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటివరకు 50,455 ఎకరాల్లో రైతులు ఆయిల్‌ఫాం సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో 12 లక్షల ఎకరాలలో ఆయిల్‌ఫాం సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆగస్టు 15లోగా సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నంగునూర్ మండలం నర్మెటలో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రిఫైన్డ్ ఫ్యాక్టరీ ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌ఫాం సాగు చేస్తున్న రైతులకు తోటకి ఫ్యాక్టరీకి ఎంత దూరం ఉందో కిలోమీటర్ల ప్రాతిపదికన కిరాయి ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఆయిల్‌ఫాం సాగుతో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కాంగ్రెస్ సర్కారు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. వర్షలు లేకున్నా..ఎండలు ఎక్కువగా ఉన్నా ఆయిల్‌ఫాం పంటలకు ఇబ్బందులు ఉండవన్నారు. ఒక ఎకరం వరి పొలానికి అందే నీరు 5 ఎకరాల ఆయిల్‌ఫాం సాగుచేయవచ్చునని తెలిపారు. ఆయిల్ ఫాంతో మంచి ఆదాయం వస్తుందన్నారు. అయిల్ ఫాం సాగుతో తెలంగాణ పచ్చబడడంతో పాటు విద్యుత్ ఆదా అవుతుందని చెప్పారు. బయట దేశాల నుంచి వచ్చే ఆయిల్ మీద సుంకం తగ్గించారని.. దాంతో 2 వేల ఆదాయం తగ్గిందన్నారు. దక్షిణ భారత మంత్రులను తీసుకొని ప్రధాని దగ్గరకు వెళ్తానని తెలిపారు.



బస్వాపూర్‌లో అయిల్‌ఫాంనమొక్కలు నాటుతున్న మంత్రులు నాగేశ్వర్‌రావు, ప్రభాకర్

**ఆయిల్‌ఫాం సాగులో హుస్నాబాద్ ఆదర్శంగా నిలవాలి**

**మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్**

రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ ఆయిల్‌ఫాం సాగులో హుస్నాబాద్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలన్నారు. అయిల్‌ఫాం, డ్రాగన్ పంటలు వేసి అధిక ఆదాయాన్ని సంపాదించాలని రైతులను కోరారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తానని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఒక్క గుంట భూమి వృధాగా ఉండొద్దన్నారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా మంచి ధరతో ఆయిల్‌ఫాం కొనుగోలు చేస్తారని తెలిపారు. దేశంలో ఆయిల్‌ఫాం సాగు తక్కువగా ఉండడం వల్ల లక్షల కోట్ల విలువైనవి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. జిల్లాలో 3747 మంది రైతులు 12,242 ఎకరాల్లో అయిల్‌ఫాం సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి, అయిల్‌ఫెడ్ కార్పోరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, రైతులు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మనన బొలిశెట్టి శివయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగుకు సింగూరు జలాలు విడుదల చేస్తున్నాం

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**పుల్‌కల్, జూలై 17, ప్రభాతవార్త:** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ పంటల సాగుకు సింగూరు జలాలను విడుదల చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా అన్నారు. గురువారం సింగూరు ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువలోకి ఎత్తిపోతల పథకం మోటార్లను ఆన్ ఏసి నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. దిగువకు వదిలిన నీటిలో పుష్పాలు చల్లి గంగామాతకు మంత్రి, నాయకులు, రైతులు, అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టు స్థిరీకరణలో భాగంగా ఎడమ కాలువ మరమ్మతులకు గత ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించామన్నారు. 10 సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వం కాలువాల్లో మొలచిన గడ్డి, ముళ్ల చెట్లను తొలగించిన పాపాన పోలేదని విమర్శించారు. ఎడమ కాలువతోపాటు ఇతర డిస్ట్రిబ్యూటర్ కాలువలను ఆధునీకరణకు నిధులు మంజూరు చేశానని గుర్తు చేశారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభత్వం కట్టుబడి ఉందన్నారు. కాలువలను ఆధునీకరించి సిమెంట్ లైనింగ్ చేసి సాగుకు జలాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని క్రాప్‌హాలిడే ప్రకటిస్తే ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని హెచ్చరించారు. అందోల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని విద్యా, వైద్యరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నానన్నారు. సింగూరు ప్రాజెక్టును టూరిజం కింద కనీవిని ఎరుగని తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. టూరిజంలో భాగంగా ప్రాజెక్టు అంతర్భాగంలో ఐల్యాండ్ నిర్మాణం, విద్యుత్ లైటింగ్ లాంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 45 రోజులు వానలు ముఖం చాటేయడంతో ఉన్న నీటిని అవసరం మేరకు జలాలను పంపింగ్ చేస్తున్నామన్నారు. సింగూరునుంచి నీటిని విడుదల చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహా సింగూరు గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను సందర్శించి విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు, ఇరిగేషన్ ఈఈ జైభీం, డీఈఈ నాగరాజు, ఏఈఈ మహిపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంజయ్య, తహసీల్దార్ కృష్ణ, కాంగ్రెస్ నాయకురాలు త్రిష, పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, గోవర్ధన్, నందికంటి శ్రీనివాస్‌ముదిరాజ్, తలారి అంజయ్య, సురేందర్‌గౌడ్, జోగిపేట ఏఎంసీ ఛైర్మన్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



సింగూరు ఎడమ కాలువ నుంచి సాగునీటిని సరఫరా చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో**

# అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**సంగారెడ్డి బ్యూరో జూలై 17, ప్రభాతవార్త:**
ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో నిబద్ధతతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్,ఎంపీ రఘునందన్ రావు, అదనపు కలెక్టర్ నగేష్, గ్రంథాలయ ఛైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి ఇతర జిల్లా అధికారులతో కలిసి శాఖలవారీగా అభివృద్ధి సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ముందుగా విద్యా వైద్యం, వ్యవసాయం,ఉద్యానవనం, సంక్షేమం, పరిశ్రమలు, వివిధ శాఖల ప్రగతి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందన్నారు. మెదక్ జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో విద్యా, వైద్యంతో పాటు సంక్షేమం ప్రగతి పథంలో ముందుకుపోతున్నాయి అన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మెదక్ జిల్లా అభివృద్ధికి జిల్లా అధికారులు సమిష్టి కృషి ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, హాజరైన అధికారులు



మొక్కలు నాటుతున్న మంత్రి

# వన మహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలి

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**

**సంగారెడ్డి బ్యూరో, జూలై 17, ప్రభాతవార్త:** మెదక్ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన అటవీ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మెగా వనమహోత్సవంలో మొక్కలు నాటిన మంత్రి వెంకటస్వామి పచ్చదనాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మెదక్‌జిల్లాలో కలెక్టరేట్ కార్యాలయంలో అటవీ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంత్రివర్యులు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ దీవి శ్రీనివాసరావు, గ్రంథాలయ ఛైర్మన్ చిలుమల సుహాసినిరెడ్డి, డీఎఫ్ఓ జోజి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 37 లక్షల మొక్కలు నాటాల్సిన లక్ష్యానికి అనుగుణంగా ముందుకు పోతున్నామన్నారు. మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తిస్తూ, విధిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడడంతోపాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయని, జీవ కోటికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు లభిస్తుందని గుర్తు చేశారు. ఇది మనకే కాకుండా మన భవిష్యత్ తరాలకు కూడా ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యతను ఇస్తూ పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగానే కాకుండా, మన అవసరాల రీత్యా కూడా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

## సిపిఐ జిల్లా మహాసభలో పలు తీర్మానాలు

**పార్టీ జిల్లా కార్యదర్శిగా మంద పవన్, సహాయ కార్యదర్శిగా గడిపె మల్లేష్**

**హుస్నాబాద్ రూరల్, జూలై17, ప్రభాతవార్త :** సిపిఐ పార్టీకి సిద్దిపేట జిల్లాలో పూర్వ వైభవం తీసుకొస్తామని ఆ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మంద పవన్ అన్నారు. గురువారం పట్టణంలోని అణభేరి సింగిరెడ్డిల అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం రాత్రి వరకు జరిగిన పార్టీ జిల్లా మహాసభలో నాలుగోసారి ఏకగ్రీవంగా జిల్లా కార్యదర్శిగా మంద పవన్‌ను ఎన్నుకోగా సహాయ కార్యదర్శిగా హుస్నాబాద్‌కు చెందిన గడిపె మల్లేష్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు. మహాసభల్లో పలు తీర్మానాలు ప్రవేశ పెట్టామని, జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయాలని, మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని యూనివర్సిటీలు నెలకొల్పి విద్యార్థులకు ఉన్నతవిద్యను అందుబాటులోకి తీసుకురావాలని, గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందించాలని తీర్మానించినట్లు వివరించారు. కాగా బుధవారం రాత్రి వరకు జరిగిన సిపిఐ జిల్లా మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శిగా మంద పవన్‌తోపాటు సహాయ కార్యదర్శిగా మల్లేష్, కార్య వర్గ సభ్యులుగా జాగిరి సత్యనారాయణ, దయానందరెడ్డి, వెంకటరెడ్డి, శంకర్, అందె అశోక్, జేరిపోతుల జనార్ధన్, కొమ్ముల భాస్కర్ , పిల్లి రజినితో పాటు 29 మంది కౌన్సిల్ సభ్యులు, ఐదుగురు క్యాండిడెట్‌ల ప్రత్యేక ఆహ్వానితులతో కౌన్సిల్‌ను ఎన్నుకోవడంతో పాటు రాష్ట్ర రైతు మండల అధ్యక్షుడిగా విజయ, పట్టణ అధ్యక్షుడిగా ఎల్లయ్య, నాయకులుగా మల్లారెడ్డి, కొమురయ్య, బిక్షపతిలను ఎన్నుకున్నారు.

## విరామం అయిపోయింది .. భవిష్యత్ అంతా విజయాలే

**మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

**హుస్నాబాద్ రూరల్ , జూలై 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకుల విరామం ఇక అయిపోయిందని, భవిష్యత్ అంతా విజయాలే సాధించబోతున్నామని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హుస్నాబాద్(రూరల్) మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. 18 నెలలు విరామం తీసుకున్న బిఆర్ఎస్ కార్యకర్తలు ఇక విరామం మాని ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించడంతోపాటు ఇచ్చన హామీలు అమలు చేయాలని ఎక్కడికక్కడ నిలయదీయాలన్నారు. ప్రభుత్వ అసమర్ధతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టిగా పని చేసుకుంటే పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడాలన్నారు. భవిష్యత్‌లో అంతా బిఆర్ఎస్ పార్టీకి విజయాలే కలుగుతాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గంగం మధన్‌మోహన్ రెడ్డి, జిల్లా మాజీ వైస్ ఛైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి, వంగ వెంకటరామిరెడ్డి, ఏఎంసి మాజీ ఛైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి ఆయా గ్రామాల మాజీ ఎంపిపి లకావత్ మానససుభాష్, మాజీ జడ్పిటిసి భూక్య మంగ, మాజీ ఏఎంసి ఛైర్మెన్ ఎడబోయిన రజిని, మాజీ సర్పంచ్‌లు తోడేటి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

## గజ్వేల్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్



సిపి అనురాధకు పూలమొక్కను అందజేస్తున్న ఎస్ఐ రవికుమార్

**గజ్వేల్, జూలై 17, ప్రభాతవార్త:**
గజ్వేల్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వి.రవికుమార్ గురువారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈసందర్భంగా సిపి అనురాధ మాట్లాడుతూ శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేకనిఘా ఏర్పాటుచేయాలని సూచించారు. రాబోవు స్థానికసంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారుచేసుకోవాలని అన్నారు. ప్రతిరోజు ఉదయం,సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ హెల్మెట్ వినియోగము, త్రిబుల్ రైడింగ్ తదితర అంశాల గురించి వాహనదారులకు అవగాహనకల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగుచర్యలు తీసుకోవాలన్నారు.

## ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న ఎడిఎ

**-జిల్లాలో 12వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ పంట సాగు**
**-ఇతర దేశాల నుండి భారంగా మారిన నూనెల దిగుబడి**
**-వచ్చే నెలలో నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం**
**-గజ్వేల్ ఎడిఎ బాబునాయక్**

**గజ్వేల్, జూలై 17, ప్రభాతవార్త:**
జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ పంటసాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు గజ్వేల్ ఎడిఎ బాబునాయక్ పేర్కొన్నారు. మెగా ప్లాంటేషన్‌లో భాగంగా గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని క్యాసారంలో రైతు వీరభద్రయ్య పొలంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డితో కలిసి ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన సందర్భంగా వారు మాట్లాడారు. ఆయిల్‌ఫామ్ పంటసాగుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ప్రోత్సహిస్తుండగా, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే వెయ్యి టన్నుల ఆయిల్‌పామ్ పంట దిగుబడిరాగా, అన్నదాతలు ఆర్థికంగా ప్రయోజనం పొందినట్లు చెప్పారు. గజ్వేల్ కేంద్రంగా ఆయిల్‌పామ్ పంట కలెక్షన్ సెంటర్‌కు శ్రీకారంచుడుతుండగా, ఆగస్టునెలలో నర్మెట్టలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇతరదేశాల నుండి నూనెల దిగుబడి భారంగా మారుతున్న దృష్ట్యా ప్రత్యామ్నాయంగా అన్నదాతలు ఈపంటసాగుపై దృష్టి పెట్టాలని, తద్వారా అధిక ప్రయోజనం పొందాలని వివరించారు. కార్యక్రమంలో మండలవ్యవసాయాధికారి నాగరాజు, ఎఎంసి, ఆత్మ డైరెక్టర్లు, ఎఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇప్పిస్తాం

**-సమ్మె కాలపు 29 రోజుల వేతనం ఇప్పిస్తాం**
**-పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్**

**నర్సాపూర్, జూలై 17, ప్రభాతవార్త:**
కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇప్పిస్తాం, సమ్మె కాలపు 29రోజుల వేతనం ఇప్పిస్తామని పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్ హామీ ఇచ్చారు. గురువారం సభ్యత్వనమోదు కార్యక్రమంలో భాగంగా నేడు మెదక్ జిల్లాలోని నర్సాపూర్ మండలం చిప్పలతుర్తి కెజిబివి ఉపాధ్యాయులకు పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్ 2025 పిఆర్‌టియు సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యనాయక్ మాట్లాడుతూ కెజిబివి ఉపాధ్యాయులకు 30 పిఆర్సీ ఇప్పించామని మెటర్నిటీ లీవ్ మంజూరు చేయించామని తెలిపారు. ఈ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ ఇప్పిస్తామని సమ్మె కాలానికి వేతనం ఇప్పిస్తామని అలాగే కేర్‌టేకర్లను నియమించే విధంగా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసి ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, మండల కార్యదర్శి భీమ్లానాయక్, శేఖర్, జహంగీర్, స్పెషల్ ఆఫీసర్‌లు, మండల, జిల్లా, రాష్ట్రబాధ్యులు పాల్గొన్నారు.

**సిప్‌అబాకస్ పోటీల్లో**

## పద్మారావునగర్ విద్యార్థుల ప్రతిభ

**సికింద్రాబాద్, జూలై 17, ప్రభాతవార్త:**
సిప్‌అబాకస్ రీజనల్ ప్రోడిజీ పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి పలుబహుమతులు గెలుచుకున్నారని పద్మారావునగర్ ప్రాంచైజీ నిర్వాహకురాలు అనురాధ రజనీకాంత్ తెలిపారు. ఈమేరకు గురువారం పద్మారావునగర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. సిప్ అబాకస్ రీజనల్ ప్రోడిజీ-2025 పేరిట ఇటీవల కాంపిటీషన్ నిర్వహించగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలు సెంటర్ల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పద్మారావునగర్ సెంటర్ విద్యార్థులు పలు మెడల్స్, ట్రోఫీలను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పద్మారావు నగర్ సెంటర్ ఎల్‌సిఎల్ అనురాధ రజనీకాంత్ మాట్లాడుతు చిన్నారుల్లో మానసిక గణన నైపుణ్యాల మెరుగు, సంఖ్యా సామర్థ్యాల అభివృద్ధి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మేధస్సు పెరుగుదలకు అబాకస్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యారంగంలో కీలకమార్పులు, టెక్నాలజీలను చిన్నప్పటినుంచి ఔపోశన పట్టేందుకు అబాకస్ ఓకీలక సాధనమన్నారు. కార్యక్రమంలో కోర్స్ ఇన్‌స్ట్రక్టర్లు సుచరిత, కవిత, విద్య, సంఘమిత్రలతోపాటు విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బన్సీలాల్‌పేట్ డివిజన్ ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం

**సికింద్రాబాద్, జూలై 17, ప్రభాతవార్త:**
బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని కవాడిగూడ, దేవీనగర్ ప్రాంతంలో స్థానికులు ఎదుర్కొంటన్న డ్రైనేజ్ సమస్యల తక్షణమే పరిష్కరించాలని కోరతూ బిజెపి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జలమండలి మారేడ్‌పల్లి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కవాడిగూడ, దేవీనగర్ ప్రాంతంలో స్థానికులకు సరిపడా డ్రైనేజీపైప్‌లైన్ లేనికారణంగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. దశాబ్దాలకిందట అప్పటి అవసరాలకుసరిపడా డ్రైనేజీపైప్‌లైన్ కొనసాగుతోందని, అపార్ట్‌మెంట్‌లు, నివాసాలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల పాత పైప్‌లైన్ సరిపోని కారణంగా తరచుగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని నేతలు తెలిపారు. దీంతో స్థానికప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈకార్యక్రమం బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ తడిసిన రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేష్ సీనియర్ నాయకులు హరినాథ్, వై.సురేష్, కె.కృష్ణ, కెఎం.కృష్ణ, ఎస్.రాజు, వై.శ్రీనివాస్‌ముదిరాజ్, ఎ.శ్రీనివాస్, లక్ష్మీ, బంధం కిరణ్‌కుమార్, పరమేష్, సెల్వరాజ్, రఘురామ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

**నిజాంపేట్, జూలై 17, ప్రభాతవార్త**
పలువురు పేదలు గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ చికిత్సకుసరిపడా స్తోమతలేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రతించగా వెంటనే స్పందించి రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా శస్త్రచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రిసహాయనిధిని మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థికసహాయాన్ని గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు కొలన్ హన్మంత్‌రెడ్డి అందజేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు చేయూతనందించండి

**-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు వినతి**



ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 17, ప్రభాతవార్త:**
స్వర్ణకారుల సమస్యలనుతీర్చి, చేయూతనందించాలని స్వర్ణకారులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందించారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావుకు, రాష్ట్ర స్వర్ణకారసంఘం సూచన మేరకు రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల గురించి, అట్లాగే తదితర అంశాలమీద మెమోరాండం సమర్పించడంజరిగిందని స్వర్ణకారసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్‌చారి తెలిపారు. జిల్లా అధ్యక్షులు పూనా రవిచారి, రామాయంపేట స్వర్ణకారసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిష్టాపురం రామకృష్ణచారి, పూన రవీందర్ చారి(కేరళ)తోపాటు టియుడబ్ల్యుజె(ఐజెయు) మెదక్ జిల్లా అధ్యక్షులు శంకర్‌దయాల్‌చారిలతో కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకారుల ఆత్మహత్యల గురించి కార్పొరేట్ జ్యువెలరీ షాప్‌ల మూలంగా ఉపాధిని కోల్పోతున్న స్వర్ణకారులకు చేయూత అందించవలసిందిగా విజ్ఞప్తిచేశారు. తెలంగాణరాష్ట్ర ఏర్పాటుతో చేతివృత్తులకు మళ్లీ మంచిరోజులు వస్తాయనిభావించి, తెలంగాణ ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించిన విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. తెలంగాణరాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా స్వర్ణకారుల మనుగడను దెబ్బతీసే విధంగా కార్పొరేట్ తరహాలో నూతనంగా జ్యువెలరీ షోరూంలు విరివిగా ఏర్పడుతున్నాయని, దీంతో మేము అనాదిగా వస్తున్న కులవృత్తులనే నమ్ముకొని, వృత్తిపైనే ఆధారపడిన స్వర్ణకారకుటుంబాలు పనులుకరువై రోడ్డునపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కావున చేతివృత్తిదారులను కాపాడుటకుగాను మాకు వెసులుబాటు కల్పించవలసిందిగా కోరుతూ పలు డిమాండ్స్‌ను అంగీకరించి, సత్వర ఆదేశాలను జారీచేయాలని కోరారు. ప్రభుత్వం వద్ద పెండింగ్ 5మెస్ కమిటీ రిపోర్టులను యథాతథంగా అమలుచేయాలి. తమిళనాడు రాష్ట్రంలో ఉన్నవిధంగా మనరాష్ట్రంలో కూడా వెంటనే 'స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు'ను ఏర్పాటు చేయాలి. జిఓఎంఎస్ నెం.272 (హోమ్‌డిపార్టుమెంట్) తేదీ.23.05.2019ను పటిష్టంగా అమలు చేసి అందులోగల లోపాలను సవరించి స్వర్ణకారులపై జరుగుచున్న పోలీసు వేధింపులను అరికట్టాలి. పుస్తెలు, మెట్టెలు, ప్రధానపు ఉంగరాలు, లక్ష్మీ రూపులు, ఈ నాలుగుపనులను మా స్వర్ణకారులే చేసేవిధంగా కార్పొరేట్ జ్యువెలరీ షాప్ లలోగాని సాధారణ జ్యువెలరీ షాపులలోగాని పుస్తె, మెట్టెలు అమ్మకుండా ప్రభుత్వం ద్వారా ఒక 'జీవో'తీసుకువచ్చి మాచేతివృత్తులనుఆదుకొనిమాకు ఉపాధికల్పించాలని తమరికి మనవిచేయుచున్నాము. స్వర్ణవృత్తిచేస్తూ అకాలమరణం పాలైన స్వర్ణకారులకు రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియామంజూరు చేయాలని కోరుచున్నాము. చేనేతకార్మికులకు, గీత కార్మికులకు రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ బీమా సౌకర్యములను, అదేవిధంగా స్వర్ణకారుకు రూ. 15000 పెన్షన్‌ను ఇవ్వాలని కోరుచున్నామని ఆయన తెలిపారు.

## మహిళలకు గృహలక్ష్మి పథకం వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి అనుసూజ

**సదాశివపేట, జూలై 17, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంచేపట్టి 18నెలలు పూర్తి అవుతున్న తరుణంలో ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు పథకాలలో ఒకటైన మహాలక్ష్మి పథకం నేటికీ ఆచరణకు నోచుకోలేదని తక్షణమే అమలుచేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి అనుసూజయాదవ్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అప్పుడు ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలకు ఆకర్షితులైన మహిళలు కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి అండగా నిలిచాలన్నారు. 18నెలలు గడుస్తున్నా, ఈపథకం అమలుకు రాకపోవడం చాలాబాధాకరం. సిఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు మహిళలపై తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు ఇంకా ఈకార్యక్రమంలో సిపిఐనాయకురాళ్లు బుజ్జమ్మ, లద్దు లక్ష్మి ౹, శివలీల, తదితరులు పాల్గొన్నారు.

## బడి ఈడు చిన్నారులు బడికి వెళ్లాలి

**-పోషకులకు అవగాహన కల్పించిన ఎంఈఓ**



పోషకులకు విద్యపై అవగాహనకల్పిస్తున్న ఎంఈఓ నాగారం శ్రీనివాస్

**సిర్గాపూర్, జూలై 17, ప్రభాతవార్త:**
బడి ఈడు చిన్నారులు విధిగా బడిలో విద్యను అందుకోవాలని, విద్యతో కలిగే ప్రయోజనాలపై గురువారం మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ బడికి దూరంగా ఉన్న చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడికిదూరంగా ఉన్న 5మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో వ్యవసాయ పనులకు వెళుతున్న క్రమంలో అటుగా వెళుతున్న ఎంఈఓ కల్పించుకుని విద్యపై విద్యార్థులకు, పోషకులకు అర్థమయ్యేరీతిలో అవగాహన కల్పించారు. పాఠశాలకు పంపేందుకు పోషకులు, చదువుకునేందుకు విద్యార్థులు ఆసక్తిచూపడంతో సిర్గాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో చేర్పిస్తానని ఎంఈఓ వారికి సూచించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం..

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 17, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలం వెంకటాపూర్.ఆర్ గ్రామానికిచెందిన బండారి భూమయ్య (58) గత కొద్దికాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బుధవారం మరణించాడు. ఈవిషయం గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న ప్రముఖ సంఘసేవకులు వెంకుగారి రాజిరెడ్డి మృతుడి కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో బండారి గంగులు, ముచ్చర్ల బాలరాజు, కొమ్మగళ్ల దావీదు, పూర్ర స్వామి, బండారి రవి, కొమ్మగళ్ళ స్వామి, బండారి శ్రీను పాల్గొన్నారు.

## మీ బ్లడ్ గ్రూపు మీరు తెలుసుకోండి



బ్లడ్ గ్రూపుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, జూలై 17, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఇరక్‌పల్లిలో గురువారం మీబ్లడ్‌గ్రూపు మీరు తెలుసుకోండి కార్యక్రమాన్ని అంబేద్కర్ యూత్‌నాయకులు గౌతమ్‌సిద్దు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ మాజీసర్పంచ్ విఠల్‌రావుపాటిల్ ప్రారంభించారు. ఈసందర్భంగా విఠల్‌రావుపాటిల్ మాట్లాడుతూ తమ బ్లడ్‌గ్రూపు ఏదో తెలిసి ఉండాలని, అత్యవసర సమయాల్లో రక్తం దానంచేసేందుకు బ్లడ్ గ్రూపు తప్పనిసరిగా అవసరం అవుతుందన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ బ్లడ్‌గ్రూపు అధ్యక్షులు ముజామిల్ చిస్తీ, రక్తదాత అవార్డు గ్రహీత ఓంప్రకాష్, కరీంసాబ్, నాగిరెడ్డి పంచాయతీకార్యదర్శి సురేందర్, భీమ్ ఆర్మీ నారాయణ ఖేడ్ డివిజన్ అధ్యక్షులు అనుముల తుకారం, ఎఎన్ఎం సబితా, శాంత, సునీత, రమేష్, ఆశావర్కర్లు కవిత, అంబేద్కర్‌సంఘం యువకులు లక్ష్మణ్, ప్రశాంత్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## భవిత ఆధ్వర్యంలో ఘనంగా బోనాల సంబరాలు



బోనాలు నిర్వహిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జూలై 17, ప్రభాతవార్త:**
బోనాల పండుగను పురస్కరించుకొని స్థానిక సదాశివపేట భవిత జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా బోనాల సంబరాలను నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ బాలరాజు మాట్లాడుతూ బోనాలపండుగ అనేది తెలంగాణ సంస్కృతికి సూచిక అని, ఈ పండుగవల్ల విద్యార్థులలో తెలంగాణసంస్కృతి ఆచారాలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని అందుకే ప్రతిసంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా బోనాల సంబరాలను నిర్వహిస్తున్నాం అని అన్నారు. అలాగే భవిత కళాశాల నుండి పురవీధులగుండా దుర్గాభవానీమాతకు బోనాలను సమర్పించుకోవడం జరిగిందని, పోతురాజుల విన్యాసాలు, విద్యార్థుల ఆటపాటలతో సంతోషంగా ఈ ఉత్సవాన్ని జరుపుకోవడం జరిగిందని, ఇది మన తెలంగాణ ఆచారమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో భవిత కళాశాల డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, రాజు, శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరంగం రవి, అధ్యాపకులు మల్లేశం, వీరన్నచారి, గోపాల్, నీలోపత్తురెడ్డి కృష్ణ, సుజాత, సంతోషి, విజయలక్ష్మి, ఉమారాణి, తేజస్విని, కళాశాల విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

# మండలంలో 8వేల ఎకరాల సాగుకు సింగూర్ జలాలు..

**-మాట నిలుపుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ**
**-మండల పార్టీ అధ్యక్షులు భక్తుల రమేష్**



విలేకరుల సమావేశంలో నిధుల మంజూరీ పత్రాలను చూపుతున్న దృశ్యం

**టేక్మాల్, జూలై 17, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండలానికి సింగూర్ జలాలను సాగుకు అందించేందుకుగాను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నిధులను మంజూరుచేయించి మాట నిలబెట్టుకున్నారని టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మనరమేష్ అన్నారు. గురువారం టేక్మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందోల్ నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, వట్‌పల్లి మండలాల రైతులకు సింగూరు జలాలను అందించేందుకుగాను మంత్రి వర్గంతో ఆమోదం తెలిపరన్నారు. సింగూర్ జలాలతో టేక్మాల్ మండల రైతుల కల సాకారం కానుందని ఆయన హర్షం వ్యక్తంచేశారు. 82.00 కి.మీ.నుండి 109.50కి.మీ.వరకు)బ్రాంచ్‌కాలువ, మట్టితవ్వకం, కట్టనిర్మాణం, కెనాల్‌లైనింగ్, పంప్ హౌస్ నిర్మాణం, సింగూర్ జలాశయానికి నీటిని సరఫరా చేయడానికి ప్రెజర్‌మెయిన్‌లు, 39,000 ఎకరాలకు సాగునీరు ఆయకట్టుకోసం కాలువ నెట్ వర్క్ వ్యవస్థను అభివృద్ధి చేయడం కోసం సర్వేను ప్రస్తుత ఏజెన్సీకి అప్పగించినట్లు చెప్పారు. శ్రీ సాయి గణేష్ అసోసియేట్స్ రూ.108.50లక్షల మొత్తానికి పరిపాలనా ఆమోదంతో ఉత్తర్వులుజారీ చేశారన్నారు. పెద్దరెడ్డిపేట బ్లాక్‌లెవల్ సర్వే నిర్వహించడం ద్వారా ఆందోల్, వట్పల్లి, రేగోడ్ అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల్లోని 40,000ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి వివరణాత్మక సర్వే నిర్వహించడం కోసం ప్రభుత్వం రూ. 110.50లక్షల ప్రస్తుత ఏజెన్సీకి (రూ.1210.11 లక్షల ఒప్పందంతో అప్పగిచ్చిందన్నారు. ఈ సమావేశంలో జోగిపేట మార్కెట్‌కమిటీ చైర్మెన్ సత్యనారాయణ, రవాణశాఖ జిల్లా కమిటీ సభ్యులు మల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంగమేశ్వర్‌గౌడ్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు మజర్,మండలనాయకులుమహేష్‌రెడ్డి,బిక్షపతి, నారాయణ,భూంరెడ్డి,యూసుఫ్,శ్రీధరాచారి, సేవాలాల్,రాజేష్,సత్యం,సక్క,సంగమేశ్వర్‌లున్నారు.

## మంత్రి కార్యక్రమానికి వెళుతున్న పార్టీనాయకుల కారు ఢీ

**-త్రుటిలో తప్పిన ప్రమాదం, అందరు సురక్షితం**

**నర్సాపూర్, జూలై 17, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణగార్డెన్‌లో గురువారం నిర్వహిస్తున్న కొత్త రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, బొగ్గుగనులశాఖ మెదక్‌జిల్లా ఇంచార్జ్‌మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈనేపథ్యంలో కార్య క్రమానికి మంత్రి కాన్వాయ్ వెనకాల వెళుతున్న అధికారపార్టీ కాంగ్రెస్ నాయకుల కార్లు ఒకదానికి వెనుక వెళ్తూ అదుపుతప్పి నర్సాపూర్ లయన్స్ క్లబ్ భవనం వద్దకు రాగానే నాలుగు ఒకదానిమీద ఒకటిపడి కారులు ఢీకొన్నాయి. ఈఘటనలో నాలుగుకార్‌లు వెనుక,ముందుభాగంలో కొద్దిపాటి ధ్వంసం కాగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోగా, త్రుటిలో అపాయాన్ని తప్పించుకొని సురక్షితంగా బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్లు అతివేగంగా నడపడంతో ఈ చిన్నప్రమాదం జరిగింది. నాయకులు అందరు సురక్షితంగా బయటపడ్డారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**చిన్నశంకరంపేట, జూలై 17, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహనతో మెలగాలని తూప్రాన్ సబ్ డివిజన్ షీటీం అధికారి గంగమణి తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు బాల్యవివాహాలు, సైబర్‌నేరాలు, అక్రమరవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా, ఫోన్‌నంబరు, ఇతర వివరాలు సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలు ఉపయోగించే సమయంలో ఫోటోలు, వీడియోలు ఎవరికి పడితే వారికి షేర్ చేయకూడదన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కర్రె పోచయ్య, ప్రభాకర్, బాలరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పర్యటనను విజయవంతం చేయండి

**-బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్**

**నర్సాపూర్, జూలై 17, ప్రభాతవార్త:**
శుక్రవారం నర్సాపూర్‌పట్టణానికి పర్యటననిమిత్తం వస్తున్న నూతనంగా ఎన్నికైనటువంటి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మెదక్‌జిల్లా పర్యటనలోభాగంగా నర్సాపూర్‌పట్టణానికి విచ్చేయనున్నారని, ఈమేరకు బిజెపి నాయకులు అందరు హాజరై విజయవంతం చేయాలని బిజెపి ఓబిసి రాష్ట్రఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం నర్సాపూర్ బిజెపి కార్యాలయంలో పాపగారి రమేష్‌గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముందుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు చేరుకోగానే ఘనస్వాగతం పలకాలన్నారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలో భారీర్యాలీగా చౌరస్తాలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంచేపట్టి అదేవిధంగా ర్యాలీగా కొనసాగుతూ కౌడిపల్లి కొల్చారం మండలాల మీదిగా ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికివెళ్లి దర్శించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మెదక్ పట్టణానికి కూడా భారీర్యాలీ వెళ్లి సాయిబాలాజీ గార్డెన్‌లో నాయకులు, కార్యకర్తలతో రానున్న స్థానికసంస్థ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు నర్సాపూర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఈపర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర బిజెపి ఓబిసి ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నీలి నాగేష్, మండల జిఎస్ యాదగిరి, మండల ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, బూత్ అధ్యక్షులు రామచందర్, రాజు, దుర్గాప్రసాద్ కార్యకర్తలు రవి,నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు



ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, జూలై 17, ప్రభాతవార్త:**
రామచంద్రాపురంలోని శ్రీగీత భూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత విద్యాసంవత్సరంలో ప్రతిభచాటిన విద్యార్థులకు గురువారం భూమి ఆకాశం ఆర్ఫనేజ్ ట్రస్ట్, క్లాస్మేట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో బహుమతులు, నోటు పుస్తకాలను అందచేశారు. కార్యక్రమానికి శాసన మండలి మాజీ ప్రోటెం చైర్మన్, భూమి ఆకాశం ఆర్ఫనేజ్ ట్రస్ట్ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి హాజరై భూమి ఆకాశం ఆర్ఫనేజ్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు గత విద్యాసంవత్సరంలో నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను ఆక్రమించిన విద్యార్థులకు రూ.3వేలు, రూ.2వేల చొప్పున, రాష్ట్రస్థాయిలో ర్యాంకుసాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.5వేల నగదు బహుమతి, 80శాతంపై మార్కులు సాధించిన 50మంది విద్యార్థులకు వేయి రూపాయలు, పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న ప్రతి విద్యార్థికి నోటుపుస్తకాలను అందచేశారు. క్లాస్మేట్ క్లబ్ సహకారంతో 16మంది విద్యార్థులకు 1116 రూపాయల చొప్పున నగదు బహుమతిని అందచేశారు. కార్యక్రమంలో భారతీనగర్, రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్లు వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి, బూరుగడ్డ పుష్పనగేష్, బిఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, క్లాస్మేట్ క్లబ్ ప్రెసిడెంట్ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, మాజీ జడ్పిటిసి సభ్యులు కొలను బాల్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ కుమార్‌గౌడ్, క్లబ్ సభ్యులు ప్రకాష్, శ్రీధర్, జగన్నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పాటి సత్యనారాయణ, గౌస్, నర్సింగ్‌రావు, అప్పారావు, భాస్కర్ పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం

**-రాష్ట్ర జాయింట్ ఆడిట్ అధికారి శ్రీనివాస్‌చారి**

**చిన్నశంకరంపేట, జూలై 17, ప్రభాతవార్త:**
విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, శుభ్రతతో కూడి భోజనం అందించాలని రాష్ట్ర జాయింట్ ఆడిట్ అధికారి శ్రీనివాస చారి సూచించారు. గురువారం చిన్నశంకరంపేట పట్టణంలోని ఎస్టీ గిరిజన బాలుర వసతి గృహన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలకు వెళ్లేల చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహం ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో పొందుపర్చాలన్నారు. రోజుకు రెండు సార్లు విద్యార్థుల హాజరును తిసుకోవాలని వార్డెన్ వెంకటస్వామికి సూచించారు.

## తాగునీటికి ఇబ్బందులు...

**చిన్నశంకరంపేట, జూలై 17, ప్రభాతవార్త:**
మండల పరిధి మడూర్ గ్రామంలో గత రెండురోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ నీళ్లట్రాక్టర్ ద్వారా ఇబ్బందులు పడుకుంటూ నీళ్లు పట్టుకున్నా మని గ్రామస్థులు తెలిపారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి ప్రతిభను వార్త విచారించగా సింగూరు నుండి మెదక్‌కు సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా చాలా గ్రామాల్లో, పట్టణాల్లో నీళ్లు రాలేదని, ప్రత్యామ్నాయంగా గ్రామపంచాయతీ నీళ్ల ట్యాంకర్ ద్వారా నీటిని అందించినట్లు తెలిపారు.

## బడి నుంచి పొలం బడికి

**చిన్నశంకరంపేట, జూలై 17, ప్రభాతవార్త:**
ధాన్యం పండించడానికి రైతులు పడేకష్టం, శ్రమను ప్రత్యక్షంగా చూసేందుకు విద్యార్థులు బడినుంచి పొలంబడికి హాజరయ్యారు. చిన్నశంకరంపేట మండలం కోరిపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం వరిమడిలో దిగి పొలం పనుల్లో పాల్గొన్నారు. మనం రోజూ తినే అన్నం ఎలా వస్తుంది, దాని కోసం ఏం చేస్తారో అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. పొలంలోకిదిగి నాట్లువేశారు. రైతులు పడేకష్టం, వ్యవసాయ పనుల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో పొలంపనుల వద్దకు తీసుకొచ్చామని ప్రధానోపాధ్యాయురాలు మాధవి అన్నారు.



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ చేపట్టాలి

**సిద్దిపేట అర్బన్, జూలై 17, ప్రభాతవార్త :** సిద్దిపేట మున్సిపాలిటీలో భారీ అవినీతి జరుగుతుందని ఒక్కొక్కటి బయటపెడతామని కౌన్సిలర్ రియాజ్, కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు సాకి అనంద్, పయ్యావుల ఎల్లం, అలకుంట మహేందర్, కొత్తపల్లి వేణుగోపాల్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ వెంటనే సస్పెండ్ చేయాలని, మున్సిపల్‌లో జరిగిన అవినీతిని సాక్షాలతో కలెక్టరేట్‌లో గురువారం ఎవో అబ్దుల్ రెహమాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ సమైక్యత వజ్రోత్సవ వేడుకల్లో రూ.7 లక్షల 50 వేల అవినీతి జరిగిందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భర్త కడవెర్గు రాజనర్సు మున్సిపల్ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తూ మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## వాగులు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోరా?

### -ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



మాట్లాడుతున్న నరోత్తం

**జహీరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:** పట్టణ సమీపంలో ప్రవహిస్తున్న వాగులు, నాలాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నా అధికారులకు పట్టదా అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో నరోత్తం మాట్లాడుతూ వాగులు, నాళాలు కబ్జా కోరల్లో చిక్కుకోవడంతో వర్షాకాలంలో ఇండ్లలోకి నీరు చేరుకుంటోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పరిధిలోని గోవింద్‌పూర్ నుంచి దోబీ నాలా వాగు జహీరాబాద్ మండలం, పట్టణ ప్రాంతాల నుంచి నారింజలో కలుస్తుందని, పట్టణంలో డ్రీమ్ వ్యాల్య కాలనీ వద్ద వాగు కుదించుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రప్రస్థ, వసంత్‌నగర్, విఆర్ తదితర కాలనీల్లోని ఇండ్లు వర్షాకాలంలో మునిగిపోతున్నాయని గుర్తు చేశారు. వాగులను కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నరోత్తం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు శివకుమార్‌లు ఉన్నారు.

## బ్యాతోల్‌లో ఘనంగా బోనాలు



బ్యాతోల్‌లో బోనాలను ఊరేగిస్తున్న దృశ్యం

**కంది, జూలై 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బ్యాతోల్‌లో గురువారం ఆషాడ మాస బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని ఆలయానికి ఊరేగింపుగా వెళుతుండగా పోతురాల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో సాంప్రదాయ దుస్తువులు ధరించి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శిరీష్, గ్రామస్థులు సుదర్శన్, రాజు గౌడ్, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో అధిక దిగుబడులు : ఎడిఎ



మాట్లాడుతున్న ఎడిఎ బాబు నాయక్

**కొండపాక, జూలై 17, ప్రభాతవార్త :** సంప్రదాయ యూరియా బస్తాలు ఎక్కువగా వాడడంవల్ల భూమిలోపల సేంద్రియ కార్బనం తగ్గి నేల నిస్సారం అవుతుందని గజ్వేల్ ఎడిఎ బాబు నాయక్ అన్నారు. గురువారం మేదినిపూర్ రైతు వేదికలో నానో యూరియాపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటల దిగుబడి కోసం రైతులు ఎక్కువగా సంప్రదాయ యూరియా వాడడంవల్ల భూమి నిస్సారంగా మారి పంట దిగుబడి తగ్గి ఖర్చులు పెరిగి ష్టపోతున్నారిని తెలిపారు, సంప్రదాయ యూరియా నివారణకై కేంద్ర, రాష్ట ప్రభుత్వాల సూచనలపై నానో యూరియా పంటలపై పిచికారి రూపంలో వాడాలని సూచించారు. నానో యూరియా వాడకంవల్ల రైతులకు ఖర్చులు తగ్గి, సమయం అదా అవుతుందన్నారు. నానో యూరియా 500 ఎంఎల్, ఒక యూరియా బస్తాతో సమానమన్నారు. నానో యూరియా వాడడంవల్ల గాలి,నీరు, వాతావరణ కలుష్యం కాకుండా కాపాడగలుగుతామన్నారు. పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో సంస్థ జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు, ఎఒ గోవిందరాజు, ఎఈఒలు రమ్యశ్రీ, శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు

**సదాశివపేట, జూలై 17 (ప్రభాతవార్త):** గురువారం లోపలి కోట పద్మశాలి సంఘం అధ్యక్షులు మునిపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలకు పూజలు నిర్వహించిన అనంతరం బోనాలను ఊరేగింపుగా గాంధీ చౌక్ మీదుగా దుర్గమ్మ మందిరం వరకు నిర్వహించారు. అనంతరం దుర్గమ్మ మందిరంలో అమ్మవారికి పూజలు నిర్వహించి నైవేద్యాల సమర్పించి మొక్కలు తెచ్చుకోవడం జరిగింది. కార్యక్రమంలో పద్మశాలి పట్టణ అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం, గడిల గణేశం, పోల మనోహర్, గోనె శంకర్, మద్దెల రమేష్ పాల్గొన్నారు.



బోనాలను తీసుకెళుతున్న మహిళలు

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలి

### గజ్వేల్ ఎఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

**గజ్వేల్ టౌన్, జూలై 17 (ప్రభాతవార్త):**

సాహసోపేత, చారిత్రాత్మక నిర్ణయాలతో పేదల మన్ననలు పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు గజ్వేల్ ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ హితవు పలికారు. గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్దార్‌ఖాన్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణంపై దృష్టిపెట్టగా, ప్రభుత్వ పథకాలను పేదల దరికి చేర్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తుండగా, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులను అందిస్తున్న ఘనత సిఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, జోగిని లక్ష్మణ్, మన్నె అరుణ్ కుమార్, పూజారి శ్రావణ్‌కుమార్, సత్యనారాయణ, ఆంథోనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే కెసిఆర్ కుటుంబం నాటకాలు**

**గజ్వేల్ టౌన్, జూలై 17 (ప్రభాతవార్త):**

దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని కెసిఆర్ మోసంచేయగా, ఎమ్మెల్సీ కవిత బిసిల పేరు చెప్పుకొని ముందుకొస్తుండగా అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కెసిఆర్ కుటుంబం నాటకాలకు తెరలేపుతున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ ఆరోపించారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలుచేసే చర్యలు చేపట్టగా, ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కు దక్కకుండా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా కెసిఆర్ దళితులను సిఎం చేస్తానని ప్రకటించి తానే గద్దెపై కూర్చోగా, ఇక ఎమ్మెల్సీ కవిత తానేమీ తక్కువ తినలేదన్నట్లుగా బిసి ఉద్యమం పేరిట బలహీనవర్గాలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపించారు. అయితే బిసి రిజర్వేషన్ బిల్లును తన ఘనతే అని బిల్డప్ ఇస్తున్న ఆమె తన తండ్రి కెసిఆర్ హయాంలో ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. అలాగే కేంద్రం వద్ద బిసి బిల్లు పెండింగ్‌లో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా బిసి బిల్లు అమలుకు సమస్యలు వస్తాయని బిజెపి నేతలు ముందే చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ అమలుకు సిఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీన వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చీకటి ఒప్పందాలతో ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి పార్టీలు చేసే కుట్రలను కాంగ్రెస్ బహిర్గతం చేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అధికారుల అక్రమార్జన వేల కోట్లలో ఉండగా, నిద్రాహారం మాని ప్రాజెక్టును నిర్మించామని చెబుతున్న కెసిఆర్, హరీష్‌రావు అవినీతి అక్రమార్జనపై ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలని కోరారు. నీటి విడుదల పేరుతో ఇక్కడి చిల్లర నేతలు రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తుండగా, చిల్లర వేషాలు మానుకోకుంటే వారే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న సర్దార్‌ఖాన్



రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచందర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం

**బెజ్జంకి, జూలై 17,ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రామచందర్‌రావును గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు.

## ప్రజారోగ్యానికి సిఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట : రంగారెడ్డి

**వర్గల్, జూలై 17 (ప్రభాతవార్త):** ప్రజారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం నెంటూర్, వర్గల్ తదితర గ్రామాలలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.900 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేగాకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు కార్పోరేట్ వైద్యం అందిస్తుండగా, రోగులకు ఆరోగ్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అప్పటికప్పుడు ఎల్ఓసిలు అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు సైతం కార్పోరేట్ వైద్యం అందించడానికి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ విప్లవాత్మక మార్పులు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మోహన్, నేతలు గోపాల్‌రెడ్డి, పొన్నాల నర్సారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

### -మండల వ్యవసాయాధికారి ప్రగతి

**ములుగు, జూలై 17 (ప్రభాతవార్త):** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ములుగు మండల వ్యవసాయాధికారి జి.ప్రగతి తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం ములుగు గ్రామానికి చెందిన రైతు దండే హనుమంతరెడ్డికి సంబంధించిన మూడు ఎకరాలలో 171 ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఏవో ప్రగతి మాట్లాడుతూ 2021-22 సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయిల్‌పామ్ సాగుపై అనేక అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను ఆయిల్‌పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ములుగు మండలంలో 223 ఎకరాలలో 45 మంది రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేయడం జరుగుతుందని, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 34 ఎకరాలలో ఆయిల్‌ఫామ్ సాగు చేయడం జరుగుతుందన్నారు. ఆయిల్ఫ్అమ్ సాగును ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్‌పై 80 నుంచి 100 శాతం సబ్సిడీ, మొక్కలపై సబ్సిడీ, మెయింటనెన్స్ చార్జీల కింద ఎకరానికి రూ.4200 చొప్పున సంవత్సరానికి రైతుల ఖాతాల్లో వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు పృథ్వీ, అనుజ్ఞ, నివేదిత, రైతులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వనమహోత్సవం

**గజ్వేల్ టౌన్, జూలై 17 (ప్రభాతవార్త):**

లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో గురువారం గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కరీమొద్దీన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విస్డం అధ్యక్షులు బాలచంద్రం, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ మల్లేశంగౌడ్, డాక్టర్ కుమారస్వామి, దొంతుల సత్యనారాయణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



అయిల్‌ఫాం మొక్కలను నాటుతున్న దృశ్యం

## మండలంలో నాటిన ఆయిల్‌ఫాం మొక్కలు

**మిరుదొడ్డి, జూలై 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని 14 మంది రైతులకు చెందిన 35 ఎకరాలలో గురువారం ఆయిల్‌ఫాం మొక్కలు నాటారు. ఇందులో భాగంగా చెప్యాల గ్రామంలో రైతు గజ్జల సాయిలు, కట్ట సాయిలు 4 ఎకరాలలో ఆయిల్‌ఫాం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు మల్లేశం, రమేష్, ప్రశాంత్, అంజనేయులు, రవి, యాదగిరి, కొండల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, జింకని చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతర పోరాటం

### టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 17 ప్రభాతవార్త :** జర్నలిస్టుల హక్కులను సాధించేందుకు నిరంతరం పోరాడే సంఘం టియుడబ్ల్యూజే(ఐజేయు) మాత్రమేనని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎ.కె.ఫైసల్ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫైసల్ మాట్లాడుతూ దశాబ్దాలుగా జర్నలిస్టుల కోసం తమ సంఘం పోరాడుతుందని చెప్పారు. మండలస్థాయి జర్నలిస్టులకు ఇంటి స్థలాలను సాధించడం లోనూ, హెల్త్ కార్డులు మంజూరు చేయడంలోనూ తమ సంఘం ఎంతో కృషి చేసిందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలపై జిల్లాలోని ప్రజా ప్రతినిధులందరిని కలిసి తొలుతగా విన్నవిస్తామని అన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే అవసరమైతే మహాధర్నా చేపడతామని తెలిపారు. వచ్చే ఆగస్టు నెల రెండో తేదీ వరకు జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లాలోని అనేకమంది అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు రాలేదని చెప్పారు త్వరలో దీనిపైన పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ . ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అనిల్ ,ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, ఉపాధ్యక్షుడు సిద్దిక్,హౌసింగ్ కమిటీ సభ్యుడు అన్వర్, నాయకులు పానుగంటి కృష్ణ, అజిత్, సిద్దన్న పాటిల్, విల్సన్, మసూద్ ఖాన్, మథిన్, మల్లేశం,బాసిత్, ఫోటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, సత్యనారాయణ, వెంకటేష్ యాదగిరి, హాజీ, నరేష్, మినాజ్, ఆంజనేయులు సంతోష్ , హరి, కృష్ణ పాల్గొన్నారు.

## విద్య సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 17,ప్రభాతవార్త:** పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్, ప్రైవేట్‌పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలనీ కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23న విద్య సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం సంగారెడ్డిలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మహేష్ లు మాట్లాడుతూ కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్.యు జిల్లా నాయకులు శ్రీకాంత్ నితిన్, ముకెందర్, అంబర్ సింగ్, మస్నీత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పిడిఎస్ యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు

## ఘనంగా కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**చిన్నకోడూరు, జూలై 17, ప్రభాతవార్త:** పెద్దచెరువు కట్ట మైసమ్మ ఆశీస్సులతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని గ్రామ లైట్ మోటర్ డ్రైవర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, అధ్యక్షుడు కుండే తిరుపతి అన్నారు. చిన్నకోడూరులోని పెద్దచెరువు కట్ట మైసమ్మ ఆలయాన్ని గ్రామ లైట్ మోటర్ డ్రైవర్ యూనియన్ సభ్యులు దాతల సహకారంతో దేవాలయం నిర్మించి గురువారం వేద పండితుల సంగీత్ శర్మ బృందంచే విగ్రహ ప్రతిష్ట గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో కట్టమైసమ్మ దేవాలయం నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కన్నారెడ్డి, కోనేటి కర్ణాకర్, బంక చిరంజీవి, పిట్ల పోచయ్య, సుపల కోనేటి మహేష్, రాజు,రాగిరి శివ, కోనేటి రాజు, వనం కనకరాజ్, కటికం సాయిలు, పిట్ల ప్రేమ్, రాపోల్ ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్



జప్తినాచారంలో బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

**కొండాపాక, జూలై 17, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్ కుమార్ అన్నారు. గురువారం జప్తినాచారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంతో ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సిద్దిపేట బస్సు డిపో మేనేజర్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి బస్సును ప్రారంభించి, బస్సులో ప్రయాణించారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన వడ్డకొండ రవీందర్ బస్సు సౌకర్యంలేక విద్యార్థులు కొంతమంది చదువులు మానుకోవాల్సి వస్తుం దని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించగా అయన స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారని తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పబ్బోజు వీరబ్రహ్మం, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కిషన్, నర్సింలు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు గ్యాస్ స్టౌ, సిలిండర్ అందజేత

**కొండపాక, జూలై 17, ప్రభాతవార్త :** చిన్నకిష్టాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేయడానికి గ్యాస్ సదుపాయంలేక పోవడంతో వంట మనుషులు పడుతున్న ఇబ్బందిని తెలుసుకున్న శ్రీకాంత్ రెడ్డి గురువారం సుమారు గ్యాస్ స్టౌ, సిలిండర్‌తోపాటు వంట సామాగ్రిని, విద్యార్థులు భోజనం చేయడానికి ప్లేట్లను సైతం అందించారు, కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజుగౌడ్, చంద్రం, శ్రీనివాస్‌చారి, హెచ్‌ఎం బండి అశోక్, ఉపాధ్యాయులు సుధారాణి, వెంకటేశం, రేఖ, స్పెషల్ ఎద్యుకేషన్ టీచర్ పంజాల ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించిన మాదాసు

**గజ్వేల్ టౌన్, జూలై 17 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ బిసిసెల్ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి తల్లి చంద్రమ్మ గురువారం అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రమ్మ మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఏఎంసి డైరెక్టర్ బొల్లారం ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి పాల రమేష్‌గౌడ్, నాయకులు బీమప్ప, బాలరాజుగౌడ్, మురళి, దశరథ, బాబుగౌడ్, జూపల్లి నర్సింలు, ఎల్లం, అనిల్, తలారి సత్తయ్య, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ సాగు విధానాలను పరిశీలించిన విద్యార్థులు

**కొండపాక, జూలై 17, ప్రభాతవార్త:** కుకునూరుపల్లి మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్ పాఠశాల విద్యార్థులకు ఈవిఎస్ పాఠంలో వ్యవసాయం పంటలు అనే అంశాలో భాగంగా 5వ తరగతి విద్యార్థులకు వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించేందుకు సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్లి పీల్డ్ విజిల్ పంజాల ప్రశాంత్ గౌడ్ అధ్వర్యంలో చేయించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పంట సాగు విధానం, వివిధ రకాల పంటలు గురించి వివరించారు. రైతులు పంటలు పండించడానికి చేస్తున్న సాగు పద్దతులను విద్యార్థులు స్వయంగా పరిశీలించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

### కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేత కనకరాజు

**చిన్నకోడూరు, జూలై 17, ప్రభాతవార్త :** గూడు లేని అర్హులైన ప్రతి పేదకు కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి కనకరాజు(బైండ్ల) అన్నారు. చిన్నకోడూరులో గురువారం బిసి కాలనీలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారులతో కలిసి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. లబ్దిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతతో నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తిని గణేష్‌గౌడ్, మేడోజి దుర్గాచారి, మహేందర్‌రెడ్డి, రాజు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కడారి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు : శ్రీనివాస్‌రెడ్డి

**కొండపాక, జూలై 17, ప్రభాతవార్త :** రైతులు అయిల్‌పామ్ సాగుచేసి అధిక లాభాలు పొందలాని గజ్వేల్ ఎడిఎ బాబు నాయక్. కొండపాక ఎఎంసి చైర్మన్ విరుకపా శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం కుకునూరుపల్లి మండల ఎరిదలోని కోనాయిపల్లి గ్రామ రైతు అట్లూరి రమేష్ తన 12 ఎకరాల విస్తీర్ణంలో అయిల్ పామ్ మెగా ప్లాంటెష్ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 4 సంవత్సరాలుగా రైతులకు అయిల్‌పామ్ సాగు కోసం సబ్సిడి అందిస్తుందన్నారు. మొక్కలు రూ॥ 20 అందించడంతోపాటు డ్రిఫ్ పరికరాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడి, ఇతర రైతులకు 90 శాతం సబ్సిడిపైన అందజేయడం జరుగుతుందన్నారు. అయిల్ పామ్ కంపేని సిద్దిపేట జిల్లా నర్మేటలో నిర్మించడం జరిగిందని అగస్టు నెలలో వ్యవసాయ శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు అయిల్ పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందలాని కోరారు. కార్యక్రమంలో ఎంపిడి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి గోవింద రాజు, ఎఈఒలు రమ్యశ్రీ, శ్రీహరి, రైతుల పాల్గొన్నారు. అదేవిధంగా కొండపాక మండల పరిధిలోని బందారంలో కామిరెడ్డి నరసింహ్మారెడ్డి 5 ఎకరాల విస్తీర్ణంలో 285 ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎఒ శివరామకృష్ణ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలపాటు పంట నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వం నుండి ప్రోత్సహకంగా అందుతుందన్నారు. రైతులందరు అయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చి అధిక లాభాలు పొందలాని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చెర్మన్ బట్ట పర్శరాములు, ఎఈఒలు ప్రనూష, సుస్మిత, మౌనిక, రైతులు పాల్గొన్నారు.



కొనాయిపల్లిలో అయిల్ పామ్ మొక్కలను నాటుతున్న ఎఎంసి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎడిఎ బాబునాయక్

## గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్

**సిద్దిపేట అర్బన్, జూలై 17, ప్రభాతవార్త :** గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువతతో పాటు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎక్సైస్ సీఐ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట అర్బన్ పరిధిలో గంజాయి నేరం చేసిన కాల్వ వెంకటేష్, గట్టు వినీల్, పర్కపల్లి రామచంద్రం, కొండూరు అరవింద్ తదితరులను గురువారం సిద్దిపేట అర్బన్ తహశీల్దార్ హరికిరణ్‌కుమార్ ఎదుట ఒక యేడాది రూ. 2 లక్షల ఫైన్‌పై బైండోవర్ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి ఇతర మత్తు పదార్థాలు అమ్మిన సేవించిన వెంటనే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

## చౌటకూరులో ఘనంగా బోనాలు

**చౌటకూరు, జూలై 17, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులో గురువారం బోనాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని గ్రామదేవతల ఆలయాలను అందంగా ముస్తాబుచేసి మామిడితోరణాలు, రంగురంగుపూలతో అందంగా అలకరించారు. గ్రామంలోని ఇళ్ల నుంచి మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని గ్రామకూడలికి చేరుకుని సామూహికంగా మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు నేత్రపర్వంగా నిర్వహిస్తూ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలను పురస్కరించుకుని జీవనోపాధికి, ఉన్నత విద్యలను అందుకునేందుకు పట్టణ ప్రాంతాలకు వెళ్లినవారు, అత్తింటికి వెళ్లిన గ్రామ ఆడపడుచులు పుట్టింటికి చేరుకోవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

## 21లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

**-పనులను ప్రారంభించిన కార్పొరేటర్ పుష్పనగేష్**



అండర్‌గ్రౌండ్‌డ్రైనేజీ నిర్మాణపనులుప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 17, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీ రోడ్డు నంబర్ 3,4లలో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మంజూరైన 21లక్షల రూపాయలతో గురువారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులు, కాలనీవాసులతో కలిసి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా హాజరైన కార్పొరేటర్ పుష్పనగేష్ దంపతులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ లోకేష్, నాయక్, కాలనీ అధ్యక్షులు అమృత్‌సాగర్, నరేంద్రబాబు, ప్రభాకర్‌రెడ్డి, రాములు, వెంకట్‌రావు, శ్రీధర్, జిలానీ, రమేష్, ఉమాశంకర్, ప్రకాష్, శంకర్, అంజద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపివో



కారముంగిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపిఓ

**నాగల్‌గిద్ద, జూలై 17, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కారముంగిగామంలో నిర్మాణంలో ఉన్న 26ఇందిరమ్మ ఇళ్లను గురువరం ఎంపిఓ ఇందిరమ్మ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవతీసుకోవాలని లబ్దిదారులకు ఎంపివో ఇందిరమ్మ సూచించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ అనిత గుండేరావు పాటిల్, పంచాయతీ కార్యదర్శి విజయ్, యూత్‌కాంగ్రెస్ నాయకులు నర్సింగ్‌పాటిల్, లబ్దిదారులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల స్కీంలో పారదర్శకత

**-మెదక్ ఎంపి రఘునందన్‌రావు**

**మెదక్ టౌన్, జులై 17, ప్రభాతవార్త:**
మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన మెదక్ పార్లమెంట్‌సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు, రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు విషయంలో సమస్యలను మంత్రిదృష్టికి తీసుకెళ్లారు. లబ్దిదారుల ఎంపికప్రక్రియలో పారదర్శకత లేకపోవడంతో, నిజమైన అర్హులైన పేదకుటుంబాలు ఈపథకం లబ్దిని పొందలేకపోతున్నాయని ఎంపి ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయ మద్దతుతో ఎంపికలు జరుగుతున్నందున ఇది అన్యాయంగా మారిందని పేర్కొన్నారు. ఈసందర్భంగా మెదక్, సిద్దిపేట మున్సిపాలిటీలో నిజమైన లబ్దిదారుల జాబితాను మంత్రికి అందజేసిన రఘునందన్‌రావు, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు మెదక్‌కు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి రాక

**-జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్**




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాల్దాస్ మల్లేష్‌గౌడ్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 17, ప్రభాతవార్త:**
నేడు నూతన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మొదటిసారిగా మెదక్‌కు రానున్నట్లు మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న మెదక్‌జిల్లాలో బిజెపి నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పర్యటించనున్నట్లు తెలిపారు. ఈపర్యటనలో భాగంగా మొదట నర్సాపూర్ నుంచి కౌడిపల్లి, కొల్చారం మీదుగా ఏడుపాయల అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మంబోజిపల్లి చౌరస్తా నుండి సాయిబాలాజీ గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన్నట్లు తెలిపారు. అనంతరం మెదక్ పట్టణంలోని సాయిబాలాజీ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి విజయం కోసం కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, కాశీనాథ్, మండల అధ్యక్షురాలు బెండ వీణ తదితరులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం

**-రూరల్ ఎస్ఐ ఎం కాశీనాథ్**

**జహీరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:**
మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ఎం.కాశీనాథ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రంజోల్‌ల యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్ సహకారంతో రంజోల్ వాకింగ్ వారియర్స్ పేరుతో 25మంది యువకులకు వాకింగ్ షూస్‌తోపాటు టీషర్టులను అందచేశారు. ఈసందర్భంగా ఎస్ఐ కాశీనాథ్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు యువనాయకులు నగేష్‌గౌడ్ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. మత్తుపదార్థాలు సేవిస్తే ఆరోగ్యం పాడవడంతోపాటు కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. వాకింగ్‌చేసే ప్రతి ఒక్కరికి షూస్‌తోపాటు టీషర్టులను అందచేస్తామని నరేష్‌గౌడ్ పేర్కొన్నారు.

# రోగులకు మెరుగైన సేవలందించాలి

**-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**
**-ఆరోగ్య కేంద్రాల అకస్మిక తనిఖీ**



ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

**మునిపల్లి, జూలై 17, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మునిపల్లి రెవెన్యూ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అకస్మిక తనిఖీచేశారు. ఆస్పత్రిలోని రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ప్రతి ఒక్కరోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో వ్యాక్సినేషన్, జ్వరం సర్వేను పరిశీలించి, మెడికల్ స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మునిపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేశారు. మండలంలో భూభారతి ప్రోగ్రెస్, కొత్త రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై మునిపల్లి తహసీల్దార్, ఎంపిడివోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణచేసి, ధ్రువీకరణ పూర్తిచేసి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులు వేగవంతంచేయాలని వారికి సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. హరితహారం లక్ష్యాన్ని చేరుకోవాలని నాటిన ప్రతిమొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రోడ్లు వేయండి...**
మునిపల్లి మండలకేంద్రానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి మునిపల్లి మండల కేంద్రంలో నిర్మించిన డబల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రోడ్లు వేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గత మూడు సంవత్సరాల నుంచి 72కుటుంబాలు నివాసం ఉంటున్న ఇళ్ల ముందు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారని మునిపల్లి మాజీ ఉపసర్పంచ్ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా 40లక్షల నిధులతో రోడ్లువేయడం కోసం ప్రభుత్వానికి ప్రపోజల్ పంపామని అన్నారని, కానీ నిధులు నేటికి మంజూరు చేయలేదని గుర్తుచేశారు. వర్షంపడిన నీళ్లు అన్నీ ఇంటి పునాదులలోకి వెళ్లి కూలిపోయే ప్రమాదం వుందని వెంటనే సిసి రోడ్లు మంజూరు చేయాలని ఆయనతోపాటు సలవోద్దీన్, మల్లేశం, నాగరాజ్ గౌడ్, రాము, వీరన్నలు కోరారు.

## గుమ్మడిదలలో ఫైర్‌స్టేషన్, ఈఎస్ఐ హాస్పిటల్..?



మంత్రిని కలిసిన గుమ్మడిదల కాంగ్రెస్ నాయకులు

**గుమ్మడిదల, జూలై 17, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రి గడ్డం వివేక్ మెదక్ జిల్లా పర్యటనకు వెళుతున్న సందర్భంగా మార్గమధ్యలో గుమ్మడిదల రహదారిపై కానుకుంట కూడలిలో బాబా సాహెబ్ అంబేద్కర్‌విగ్రహానికి పూలమాలలువేసి అనంతరం కొద్దిసేపు స్థానికనాయకులతో చర్చించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు పుట్టు నర్సింగరావు కాంగ్రెస్‌నాయకులు ఆయననుకలిసి తమ ప్రాంతానికి ఫైర్ స్టేషన్, కార్మికుల ఈఎస్ఐ హాస్పిటల్‌ను మంజూరుచేయాలని వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాపర్యటనకు వెళుతున్న సందర్భంగా కొద్దిసేపు గుమ్మడిదల కాంగ్రెస్‌నాయకులతో కొద్దిసేపు మండల పరిస్థితులపై ఆరాతీశారని అనంతరం గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, వీరన్నగూడెం, వార్డులలో కార్మికులు ఎక్కువ ఉన్నందున పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతూ ఉంటాయని అందుబాటులో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుచేయాలని అలాగే కార్మికులకు వారి కుటుంబాలకు ఆరోగ్యంకేంద్రం ఈఎస్ఐ ఏర్పాటుచేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సంబంధితశాఖ అధికారులకు త్వరలో ఉత్తర్వులు జారీచేస్తానని తెలిపినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్ది వీరారెడ్డి, సురభి నాగేంద్రగౌడ్, జయశంకర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, తుడుం శ్రీనివాస్, తులసీదాస్, రామ్‌రెడ్డి, కానుకుంట వెంకటేశ, కావలి శంకర్, సురభి కుమార్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, నర్సింగ్, సాగర్, కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి సొంత గృహం

**-ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి**



ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జూలై 17, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద లబ్దిదారులకు పటాన్‌చెరు ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన గురువారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవారికి గూడు ఉండాలి అంటే ఇందిరమ్మరాజ్యంతోనే అది సాధ్యమని అన్నారు. ప్రతి పేదవారికి కచ్చితంగా విడతలవారీగా గృహాలుమంజూరవుతాయని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు ఎవరికైనా రాని ఎడల సంబంధిత అధికారులు, నాయకులను సంప్రతించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, చంద్రయ్య, హనుమంత్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి రక్షిత మంచినీరు

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



మంచినీటిని ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, జూలై 17, ప్రభాతవార్త:**
నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం మిషన్ భగీరథ పథకంద్వారా ఇంటింటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్‌బో మెడోస్ కాలనీలో మంచినీటి నల్లా కనెక్షన్లను గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం ఐలాపూర్ గ్రామంలో పదిలక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సిసిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలో ఇటీవల విలీనమైన గ్రామాలలోగల కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. మంచినీటి సమస్య పరిష్కారానికి అమీన్‌పూర్ పరిధిలో రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తికావడంతోపాటు పంపిణీ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. విలీనగ్రామాల పరిధిలో సిసిరోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, శ్రీకాంత్, గోవింద్, కాలనీ అధ్యక్షులు జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్లు కబ్జా కాకుండా చూడాలని తహసీల్దార్‌కు వినతిపత్రం

**-రాష్ట్ర రైతుసంఘాల నాయకులు మద్దుల బాల్‌రెడ్డి**



తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

**గుమ్మడిదల, జూలై 17, ప్రభాతవార్త:**
పంటపొలాలకు వెళ్లే రోడ్లను వెంచర్ నిర్వాహకులు కబ్జాలకు గురిచేస్తున్నారని రాష్ట్ర రైతుసంఘాల నాయకులు మద్దుల బాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల రైతుసంఘం అధ్యక్షులు అమ్మవారి సదానంద రెడ్డి గ్రామరైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గురువారం గుమ్మడిదల తహసీల్దార్ ఎం.పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్దుల బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గుమ్మడిదల గ్రామ రెవెన్యూ పరిధిలోని రాంనగర్ నుండి ధర్మారం వెళ్లే రోడ్లను ప్రస్తుతం పలువురు వెంచర్ వ్యాపారవేత్తలు రోడ్డును తొలగించి భూమిని సాగుచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నిసంవత్సరాలుగా ఉన్నటువంటి రోడ్డును వదిలిపెట్టే విధంగా రెవెన్యూ అధికారులు అటువైపు వెళ్లే రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షాన రైతులంతా ఏకమై నిరసనలు చేస్తామని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్‌గౌడ్, పోచుగారి శ్రవణ్‌రెడ్డి, కావాలి రాహుల్‌యాదవ్, రామ్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీశైలం, శ్రీనివాస్, దేవయ్య, మల్లయ్య, భాస్కర్, కిష్టయ్య, సత్యనారాయణ, కృష్ణ, నర్సింలు, సత్తయ్య, గ్రామస్థులు తదితరులున్నారు.

# మెదక్‌లో ఘనంగా సిబిఎస్ ప్రారంభోత్సవం

## సందడి చేసిన హీరోయిన్ వైష్ణవి చైతన్య



షో రూమ్ ప్రారంభిస్తున్న హీరోయిన్ వైష్ణవి చైతన్య



షోరూమ్‌లో సందడి చేసిన హీరోయిన్

**మెదక్, జూలై 17, ప్రభాతవార్త:**
ప్రముఖ వ్యాపారసంస్థ చందన బ్రదర్స్ తెలంగాణలోని తమ 7వ షోరూంని గురువారం ఘనంగా ప్రారంభించారు.
మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, బేబీఫేమ్ వైష్ణవి చైతన్య, జబర్దస్‌ఫేమ్ వర్షలు ముఖ్యఅతిథులుగా హాజరై షోరూమ్‌ని ప్రారంభించారు.
ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చిన్న అవసరానికి హైదరాబాద్ వెళ్లే అవసరం లేకుండా చందన బ్రదర్స్ వారు మెదక్ ప్రజలకు అందుబాటులో షోరూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో ఆఫర్‌లతో ప్రజలను ఆకట్టుకోవడంలో చందన ముందుంటుంది అన్నారు. అనంతరం చందన బ్రదర్స్ షాపింగ్ కాంప్లెక్స్ మొత్తంతిరుగుతూ అన్ని స్టాల్‌లను సందర్శించడం జరిగింది. జబర్దస్ నటులు రైజింగ్ రాజు, నూకరాజు, హైమాలు సందడి చేశారు.

## చెరియాల్ పంచాయతీని సందర్శించిన డిపిఓ

**కంది, జూలై 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చెరియాల్ పంచాయితీని గురువారం జిల్లా పంచాయితీ అధికారి టి సాయిబాబా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయితీ కార్యాలయంలో గ్రామ పంచాయితీ ఆస్తులు, పంచాయితీ కార్యక్రమాలపై డిపిఓ సమీక్షించారు. పంచాయితీలోని రికార్డులను, పరిసర ప్రాంతాల పరిశుభ్రత పురోగతి, నర్సరీ, ఓహెచ్ఎస్ఆర్‌లను, మురుగు వ్యర్థాల నిర్వహణ షెడ్, శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఓ సాయిబాబా మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత సక్రమంగా లేదన్నారు. తడిగా పొడిగా ఉండే వ్యర్థాలను సక్రమంగా వేరుచేయడం లేదని గుర్తించామన్నారు. పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని, తడిచెత్త పొడి చెత్త వేరు చేసే ప్రక్రియను విధిగా పాటించాలని ఆదేశించారు. పంచాయితీ రికార్డులను సమగ్రంగా నిర్వహిస్తూ సకాలంలో నవీకరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి మహేందర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎంపి రఘునందన్‌రావు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**రామచంద్రాపురం, జూలై 17, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటికి కేటాయించిన అంబులెన్స్‌ను గురువారం ఎంపి రఘునందన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ అంబులెన్స్ సౌకర్యం అందుబాటులోలేక గతంలో ఎంతోమంది విలువైన నిండుప్రాణాలను పోగొట్టుకోవాల్సి వచ్చిందని విచారంవ్యక్తంచేశారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ వినతిమేరకు ప్రత్యేక అంబులెన్స్‌ను కేటాయించామన్నారు. ఈసందర్భంగా ఎంపి రఘునందన్‌రావు మున్సిపల్ కార్యాలయంలో ప్రజలతో పౌర, మౌలిక సదుపాయాల సమస్యలపై చర్చించారు. జూలై 26న సమగ్రమైన సమీక్షాసమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు రాంబాబుగౌడ్, సొసైటీచైర్మన్ బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ పరిసరాలసంఘం అధ్యక్షులు ఈశ్వర్‌గారి రమణ, డిప్యూటీ ఈఈ సత్యనారాయణ, ఎఈ సాయిమౌనిక, మేనేజర్ అఖిల్‌కుమార్, మాజీకౌన్సిలర్లు శంషాబాద్ రాజు, శ్రీశైలం యాదవ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కనే గుంత-అధికారులకు పట్టదా ఇంకా



ఝరాసంగంలో మెయిన్‌రోడ్డు పక్కన ఏర్పడ్డ గుంత దృశ్యం

**ఝరాసంగం, జూలై 17, ప్రభాతవార్త:**
అది మండలకేంద్రం. గ్రామంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వరస్వామి ఆలయం కొలువై ఉంది. నిత్యం వేలాదిగా తరలివచ్చే గ్రామంలోని మెయిన్‌రోడ్డులో గోతులు ఏర్పడి నెలలు గడుస్తున్నా అధికారులకు పట్టకపోవడం విస్మయాన్ని కల్గిస్తోంది. ఇందుకు సంబంధించి పూర్తివివరాల్లోకి వెళితే, మండలకేంద్రమైన ఝరాసంగంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో (మండలపరిషత్, రెవిన్యూ, వ్యవసాయ, విద్యుత్‌శాఖల కార్యాలయాలకు, పోలీసుఠాణాకు, ప్రభుత్వ ఆసుపత్రులకు) నిత్యం ఆయాగ్రామాల నుంచి ప్రజలతోపాటు గ్రామంలో కొలువుండి దక్షిణకాశీగా భక్తులచే పూజలందుకుంటున్న శ్రీకేతకి సంగమేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఆయారాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు వేలసంఖ్యలో వస్తూ ఉంటారు. రోడ్డుపక్కనే ఏర్పడ్డ గోతి పశువైద్యశాల, పోలీసుఠాణా, పంచాయతీ కార్యాలయాల పరిసరాల్లో ఏర్పడింది. ఈదారి గుండానే నిత్యం అయా ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు వెళుతూ ఉంటారు. నిత్యం గుంత పక్కనుంచే పయనమవుతున్నా గుంతను పూడ్చాలన్న ఆలోచన అధికారులకు, పాలకులకు రాకపోవడం విస్మయాన్ని కల్గిస్తోంది. వర్షాకాలం కావడంతో వర్షపునీరు గోతిలో నిలిచిపోతే అటుగావచ్చే వాహనచోదకులు గుంతలోపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపక్కన ఏర్పడ్డ గుంతనుపూడ్చి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలతోపాటు భక్తులు సూచిస్తున్నారు.

## త్వరలోనే రాష్ట్రంలో బిఆర్ఎస్ భూస్థాపితం

**-బావకు బావమరిదికి చుక్కలు చూపిస్తా...!!**
**-మా దాడిని తట్టుకోలేరు,,,!!**
**-మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



విలేకరులతో మాట్లాడుతున్న మైనంపల్లి హనుమంతరావు

**సంగారెడ్డి బ్యూరో, జూలై 17, ప్రభాతవార్త:**
తెలంగాణలో త్వరలో బిఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు అన్నారు. మెదక్ పట్టణంలోని చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ఓపెనింగ్ కార్యక్రమానికి హాజరై మీడియాతో మాట్లాడారు. బావాబామ్మరుదులకు చుక్కలు చూపిస్తాం అని, మేము దాడిచేస్తే తట్టుకోలేరు అని హెచ్చరించారు. పుట్టుకతో బిజెపి, కాంగ్రెస్ పార్టీలలో ఉన్నవారిని తెలంగాణ పేరుతో పార్టీలో చేర్చుకుని వాళ్ల బతుకులు ఆగం చేశారన్నారు. బిఆర్ఎస్ పార్టీల నుంచి పెద్ద ఎత్తున వలసలు ఉంటాయని అన్నారు. మీడియా దాడులు మానుకోవాలి అని, లేనిపక్షంలో తిరిగి దాడులుచేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, నాయకులు వెంకటరమణ, కొండన్ సురేందర్‌గౌడ్, మధుసూదన్, దొంతి లక్ష్మి, మంగ లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు కార్డులకు నమోదు చేసుకోండి

**సంగారెడ్డి టౌన్, జూలై 17, ప్రభాతవార్త:**
వ్యవసాయ భూమి ఉన్న రైతులు కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందుకునేందుకు విధిగా ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలని కలబ్‌గూర్ క్లస్టర్ ఎఈఓ బి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింకు ఉన్న మొబైల్‌నంబర్‌లతో సంగారెడ్డిలోని వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బి.శ్రవణ్‌కుమార్ సూచించారు.